క్లుప్తంగా

అంజన్న సేవలో చొప్పదండి ఎమ్మెల్యే



కొండగట్టు: కొండగట్టు అంజన్న పవిత్రోత్సవాల్లో భాగంగా స్వామివారిని శనివారం చొప్పదండి ఎమ్మెల్యే మేడిపెల్లి సత్యం దర్శించుకున్నారు. యాగశాలలోని ఉత్సవమూర్తులకు పూజలు చేశారు. ఏఈవో అంజయ్య, ప్రధాన అర్చకులు పెద్ద జితేంద్రప్రసాద్ స్వామి, చిరంజీవ స్వామి, కపీందర్, నాయకులు దొంగ ఆనందరెడ్డి, ముత్యం శంకర్‌గౌడ్, ఏలేటి కమలకర్‌రెడ్డి, గోల్కొండ రాజు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

రేణుక ఎల్లమ్మ విగ్రహ ప్రతిష్ఠ



మేడిపల్లి: భీమారం మండలంలోని దేశాయిపేటలో శనివారం రేణుక ఎల్లమ్మ విగ్రహ ప్రతిష్ఠ నిర్వహించారు. కార్యక్రమానికి వేములవాడ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ హాజరయ్యారు. గౌడ కులస్తులు ఆయనను సన్మానించారు. కాంగ్రెస్ మండల శాఖ అధ్యక్షుడు నరేశ్‌రెడ్డి, గౌడ సంఘం నాయకులు పాల్గొన్నారు.

ధర్మపురి బ్రహ్మోత్సవాల కమిటీ నియామకం

ధర్మపురి: స్థానిక శ్రీలక్ష్మీనృసింహస్వామి దేవస్థానంలో ఈ నెల 20 నుంచి ఏప్రిల్ 1 వరకు స్వామివారి బ్రహ్మోత్సవాలు నిర్వహించనున్నారు. ఈ మేరకు ఈ నెల 15న ఉత్సవ కమిటీని నియమించినట్లు శనివారం దేవాదాయశాఖ నుంచి ఉత్తర్వులు వెలువడ్డాయి. ఇందులో మొత్తం 13 మంది సభ్యులు జక్కు రవీందర్, ముత్తినేని మల్లేశం, బాదినేని సత్యనారాయణ, రాందేని మొగిలి, దాసరి పురుషోత్తం, ఎదులాపురం మహేందర్, రాపర్తి సాయికిరణ్, స్తంభంకాడి గణేశ్, పసుపుంటి శ్రీకాంత్, మాదాసు మల్లేశ్, లఠెట్టి సుజాత, కొమురెల్లి పవన్‌కుమార్, నెదుమూరి శ్రీధర్ ఉన్నారు.

రాజీమార్గంతో కేసుల పరిష్కారం



మెట్‌పల్లి: లోక్ అదాలత్‌లో రాజీ కుదుర్చుకుంటే సత్వరమే కేసులను పరిష్కరిస్తున్నామని మెజిస్ట్రేట్ అరుణ్‌కుమార్ అన్నారు. మెట్‌పల్లి పట్టణంలోని మున్సిఫ్ కోర్టులో శనివారం జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమం నిర్వహించారు. ఇందులో మొత్తం 388 కేసులను మెజిస్ట్రేట్ పరిష్కరించినట్లు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు పుప్పాల లింబాద్రి తెలిపారు. న్యాయవాదులు పాల్గొన్నారు.

ఇద్దరు ఎస్సైల బదిలీ

జగిత్యాల క్రైం: జిల్లాలో ఇద్దరు ఎస్సైలను బదిలీ చేస్తూ ఎస్పీ సన్‌ప్రీత్‌సింగ్ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. జగిత్యాల టౌన్ ఎస్సైగా పని చేస్తున్న దత్తాత్రి జగిత్యాల సీసీఎస్ ఎస్సైగా, జగిత్యాల సీసీఎస్ ఎస్సై నరేశ్ జగిత్యాల టౌన్ ఎస్సైగా బదిలీ అయ్యారు.

28న మెట్‌పల్లి బార్ అసోసియేషన్ ఎన్నికలు

మెట్‌పల్లి: ఈ నెల 28న మెట్‌పల్లి బార్ అసోసియేషన్ ఎన్నికలు జరగనున్నాయి. ఈ మేరకు ఎన్నికల అధికారులు భూమేశ్వర్, శ్రీనివాస్, వెంకటనర్సయ్య, వెంకటస్వామిలు శనివారం ఎన్నికల షెడ్యూల్ విడుదల చేశారు. 153 మంది న్యాయవాద ఓటర్లు ఉన్నారన్నారు. 18 నుంచి 20 తేదీ వరకు నామినేషన్ల స్వీకరణ, 22న ఉపసంహరణ, 28న ఎన్నికలతోపాటు ఫలితాలు వెల్లడించనున్నట్లు పేర్కొన్నారు.

శ్రీరాజరాజేశ్వరస్వామి కల్యాణం



మెట్‌పల్లిరూరల్: ఆత్మనగర్‌లో శ్రీరాజరాజేశ్వర స్వామి ఆలయ వార్షికోత్సవంలో భాగంగా శనివారం స్వామివారి కల్యాణం నిర్వహించారు. పూజా కార్యక్రమాలు జరిపారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నదానం చేపట్టారు.

మాజీ ఎమ్మెల్యే పరామర్శ

మల్యాల: అనారోగ్యంతో బాధ పడుతున్న మల్యాల మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ ఉత్కం గంగాధర్‌ను చొప్పదండి మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ శని వారం ఆస్పత్రికి వెళ్లి, పరామర్శించారు.

జెడ్పీ చైర్‌పర్సన్..

కథలాపూర్: అంబారిపేట మాజీ సర్పంచ్ గోపు శ్రీనివాస్‌ను జెడ్పీ చైర్‌పర్సన్ దావ వసంత శనివా రం పరామర్శించారు. ఆయన భార్య రాధ ఇటీవల అనారోగ్యంతో మృతిచెందారు.

ఇందిరమ్మ ఇళ్లపై ఆశలు

- పథకాన్ని ప్రారంభించిన ప్రభుత్వం
- స్థలం ఉంటే ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షల సాయం
- జిల్లాలో 42 వేల మందికి పైగా దరఖాస్తు



గొల్లపల్లి: ఏళ్లుగా సొంతింటి కోసం ఎదురుచూస్తున్న పేదలకు ఇందిరమ్మ ఇళ్ల పథకం ప్రారంభంతో మళ్లీ ఆశలు చిగురించాయి. బీఆర్‌ఎస్ ప్రభుత్వం డబుల్ బెడ్‌రూం ఇళ్లు కట్టిస్తామని ప్రకటించినా ఆచరణలో అనుకున్న లక్ష్యాన్ని చేరుకోలేదు. అసెంబ్లీ ఎన్నికలకు ముందు గృహలక్ష్మి పేరిట సొంత స్థలంలో ఇల్లు నిర్మించుకుంటే రూ.3 లక్షల ఆర్థికసాయం అందిస్తామని ప్రకటించి, దరఖాస్తులు స్వీకరించింది. కొన్నిచోట్ల లబ్ధిదారులకు ప్రొసీడింగ్ కాపీలు కూడా అందించారు. అంతలోనే ఎన్నికల కోడ్ రావడంతో ఆ పథకానికి బ్రేక్ పడింది. ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో మెనిఫెస్టోలో చెప్పినట్లు సొంత స్థలం ఉన్నవారికి ఇంటి నిర్మాణం కోసం రూ.5 లక్షలు ఇచ్చే పథకాన్ని సీఎం రేవంత్‌రెడ్డి భద్రాద్రిలో ప్రారంభించారు. ఒక నియోజకవర్గంలో 3,500 మందికి ఇస్తామని ప్రకటించారు. జగిత్యాల జిల్లాలో ధర్మపురి, కోరుట్ల, జగిత్యాల నియోజకవర్గాలు ఉన్నాయి. వీటి పరిధిలోని 10,500 మంది పేదలకు లబ్ధి చేకూరనుంది. ప్రజాపాలనకు మొత్తం 1,52,976 దరఖాస్తులు వచ్చాయి. వీటిలో ఇళ్ల కోసం వచ్చినవి 42 వేలకు పైగా ఉన్నాయి. ఇంటి స్థలం లేనివారికి స్థలంతో పాటు రూ.5 లక్షలను సర్కారు అందించనుంది.

రేషన్ కార్డు ఆధారంగా ఎంపిక

ఇందిరమ్మ ఇళ్లలో ఒక వంట గది, టాయిలెట్ ఉండేలా నమూనా రూపొందించారు. లబ్ధిదారులు దారిద్ర్యరేఖ(బీపీఎల్)కు దిగువ ఉండాలి. రేషన్ కార్డు ఆధారంగా ఎంపిక ఉంటుంది. గుడిసె, గడ్డితో పైకప్పు, మట్టిగోడలతో నిర్మించిన తాత్కాలిక ఇళ్లు ఉన్నవారు, వివాహమై, ఉమ్మడి కుటుంబంలో ఉంటున్నవారు, సింగిల్ ఉమెన్, వితంతు మహిళలు కూడా అర్హులే. లబ్ధిదారులు గ్రామం లేదా మున్సిపాలిటీ పరిధివారై ఉండాలి.

జిల్లాకు రూ.525 కోట్లు అవసరం

లబ్ధిదారుల జాబితాను ముందుగా గ్రామసభలో ప్రదర్శిస్తారు. ఆ తర్వాత ఫైనల్ చేస్తారు. జిల్లా ఇన్‌చార్జి మంత్రిని సంప్రదించి, కలెక్టర్ ఇంటిని మంజూరు చేస్తారు. కలెక్టర్ ఎంపిక చేసిన బృందాలు లబ్ధిదారుల అర్హతలను క్షేత్రస్థాయిలో పరిశీలిస్తాయి. 400 చదరపు అడుగుల్లో ఇంటి నిర్మాణం చేపట్టాలి. బేస్‌మెంట్ స్థాయిలో రూ.లక్ష, పైకప్పు నిర్మాణం జరిగే సమయంలో మరో రూ.లక్ష, ఆ తర్వాత రూ.2 లక్షలు ఇస్తారు. ఇంటి నిర్మాణం పూర్తయ్యాక మరో రూ.లక్ష లబ్ధిదారుల బ్యాంక్ ఖాతాలో జమ చేస్తారు. జిల్లాలో ఈ పథకానికి రూ.525 కోట్లు అవసరమవుతాయని అధికారులు తెలిపారు. సొంతింటి కోసం ఏళ్లుగా ఎదురుచూస్తున్నామని ఇప్పటికైనా ఇవ్వాలని పేదలు కోరుతున్నారు.

ఏళ్లుగా ఎదురుచూస్తున్నం



మేము ఎన్నో ఏళ్లుగా ఇళ్లు కట్టుకోవడానికి ఎదురుచూస్తున్నాం. నాకు గుంట భూమి లేదు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద రూ.5 లక్షలు ఇస్తామని చెప్పడం సంతోషంగా ఉంది. ఆ డబ్బులతో ఇల్లు నిర్మించుకుంట.

– ఆకుల సునీత, లక్ష్మీపూర్, గొల్లపల్లి మండలం

అద్దె ఇంట్లో ఉంటున్నం



మేము అద్దె ఇంట్లో ఉంటున్నం. ధర్మపురిలో 100 గజాల స్థలం ఉంది. గత ప్రభుత్వంలో గృహలక్ష్మి పథకానికి దరఖాస్తు చేసుకున్నం. కానీ, ఇంటి నిర్మాణ అనుమతి రాకుండానే రద్దయింది. కాంగ్రెస్ ప్రభుత్వం ఇందిరమ్మ ఇల్లు ఇవ్వాలి.

– కొంవేణి సత్యవతి, ధర్మపురి

అలరించిన వీడ్కోలు వేడుకలు



జీర్‌పూర్ హైస్కూల్లో నృత్యం చేస్తున్న విద్యార్థులు

సారంగాపూర్: బీర్‌పూర్ మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదోతరగతి విద్యార్థులకు శనివారం వీడ్కోలు వేడుక నిర్వహించారు. తొమ్మిదో తరగతి విద్యార్థులు నృత్యాలతో సందడి చేశారు. హెచ్‌ఎం నర్సింహమూర్తి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



మాస్ట్రో బాలికల కళాశాలలో..

కోరుట్ల: పట్టణంలోని మాస్ట్రో బాలికల జూనియర్ కళాశాలలో ద్వితీయ సంవత్సర విద్యార్థులకు శనివారం వీడ్కోలు కార్యక్రమం నిర్వహించారు. ఆటపాటలతో సందడి చేశారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ రాజేశ్, లెక్చరర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులు ఉన్నత లక్ష్యాలతో ముందుకెళ్లాలి

కథలాపూర్: విద్యార్థులు ఉన్నత లక్ష్యాలతో ముందుకెళ్లాలని, వాటి సాధన కోసం కృషి చేయాలని మెట్‌పల్లి ఆర్డీవో శ్రీనివాస్ అన్నారు. శనివారం కథలాపూర్ మండలంలోని అంబారిపేట జెడ్పీ హైస్కూల్లో పదోతరగతి విద్యార్థుల వీడ్కోలు కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై, మాట్లాడారు. విద్యార్థులకు చదువుతోపాటు క్రీడలు అవసరమని, పబ్లిక్ పరీక్షలు సమీపిస్తున్నందున చదువుపై దృష్టి సారించాలని సూచించారు. అనంతరం సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. హెచ్‌ఎం కిషన్ రావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఆర్డీవో శ్రీనివాస్

గంగపుత్ర కార్పొరేషన్ ఏర్పాటుపై హర్షం

కోరుట్ల: గంగపుత్ర కార్పొరేషన్ ఏర్పాటుకు రాష్ట్ర కేబినెట్ ఆమోదం తెలుపడంపై కాంగ్రెస్ ఫిషర్‌మెన్ నియోజకవర్గ అధ్యక్షుడు ఇట్యాల రాజేందర్ హర్షం వ్యక్తం చేశారు. గంగపుత్రుల సంక్షేమం కాంగ్రెస్‌తోనే సాధ్యమన్నారు. గత ప్రభుత్వ హయాంలో కార్పొరేషన్ ఏర్పాటు కోసం ఎన్నోసార్లు ప్రయత్నించినా పట్టించుకోలేదన్నారు. బడుగు బలహీన వర్గాల అభివృద్ధి తమ పార్టీతోనే సాధ్యమని పేర్కొన్నారు.

వడ్డీ లేని రుణం మహిళలకు వరం



సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న చైర్‌పర్సన్ జ్యోతి, నాయకులు

- జగిత్యాల మున్సిపల్ చైర్‌పర్సన్ అడువాల జ్యోతి

జగిత్యాల: వడ్డీ లేని రుణం మహిళలకు వరమని మున్సిపల్ చైర్‌పర్సన్ అడువాల జ్యోతి అన్నారు. శనివారం జగిత్యాలలో సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. మహిళా సంఘాల బలోపేతం కోసం ఆయన చర్యలు తీసుకుంటున్నారని తెలిపారు. వడ్డీ లేని రుణాలతో మహిళలు ఆర్థిక సాధికారత సాధిస్తారన్నారు. కార్యక్రమంలో మాజీ చైర్‌పర్సన్ విజయలక్ష్మి, పట్టణ అధ్యక్షురాలు అనిత తదితరులు పాల్గొన్నారు.

గృహజ్యోతి నిరంతర ప్రక్రియ

గృహజ్యోతి నిరంతర ప్రక్రియ అని మున్సిపల్ చైర్‌పర్సన్ అడువాల జ్యోతి అన్నారు. శనివారం పలు ప్రజాపాలన సెంటర్లను పరిశీలించారు. ప్రజలను కొందరు అభద్రతాభావానికి గురిచేస్తున్నారని పేర్కొన్నారు. జగిత్యాల పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచాలని శానిటేషన్ సిబ్బందిని ఆదేశించారు. అంతకుముందు మున్సిపల్ సిబ్బందికి చీపుర్లు అందజేశారు. ఆమె వెంట కౌన్సిలర్ సింగరావు తదితరులున్నారు.

కోర్టు ఆవరణలో చలివేంద్రం ప్రారంభం

ధర్మపురి: స్థానిక కోర్టు ఆవరణంలో న్యాయవాదులు ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని జూనియర్ సివిల్ జడ్జి శ్యాంప్రసాద్ శనివారం ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ.. కక్షిదారులు, పోలీస్ సిబ్బంది తదితరుల దాహం తీర్చడం కోసం చలివేంద్రం ఏర్పాటు చేయడం అభినందనీయమని అన్నారు. కార్యక్రమంలో న్యాయవాదులు గడ్డం సత్యనారాయణరెడ్డి, రౌతు రాజేశ్, రామడుగు రాజేశ్, గుడ జితేందర్, బత్తిని ఇంద్రకరణ్, జాజాల రమేశ్, కస్తూరి శరత్, ఎస్సై ఉదయ్‌కుమార్, ఎక్సైజ్ సీఐ మహేందర్ సింగ్ తదితరులు పాల్గొన్నారు.

మల్లాపూర్ మండల కేంద్రంలో..

మల్లాపూర్: మండల కేంద్రంలో అప్పాల వికాస్ స్మారకార్థం అతని మిత్ర బృందం శనివారం చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో శ్రీనివాస్, రమేశ్, రాజమోహన్, విష్ణువర్ధన్, నితిన్ తదితరులు పాల్గొన్నారు.



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న జడ్జి శ్యాంప్రసాద్

నిధులు కార్మికులకే ఖర్చు చేయాలి



జగిత్యాల: వెల్ఫేర్ బోర్డు నిధులు కార్మికులకే ఖర్చు చేయాలని సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి రత్నాకరం కోటంరాజు అన్నారు. శనివారం జగిత్యాలలోని ప్రజాసంఘాల కార్యాలయంలో తెలంగాణ భవన నిర్మాణ కార్మికుల సంఘం సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న రైతు, ప్రజా వ్యతిరేక విధానా లను ఎండగట్టాలని పిలుపునిచ్చారు. ఈ నెల 23న ఏఎల్‌వో ఆఫీసుల వద్ద ధర్నా, ఏప్రిల్ 8న కలెక్టరేట్‌ల వద్ద నిరసన, ఏప్రిల్ 23న స్థానిక సమస్యలపై చలో హైదరాబాద్ కార్యక్రమం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. కార్మికులందరూ హాజరు కావాలని కోరారు. అనంతరం నూతన కమిటీని ఎన్నుకున్నారు. కన్వీనర్‌గా బొర్ర శేఖర్, సభ్యులుగా రఫీ, మహమ్మద్, సులేమాన్, చంద్రయ్య, విజయ్, రమేశ్, లక్ష్మీరాజ్, చాంద్‌పాషా ఎన్నికయ్యారు.

ఎరువుల స్టాక్‌బోర్డు తప్పనిసరి

కోరుట్ల రూరల్: ఎరువుల దుకాణాల్లో స్టాక్‌బోర్డు తప్పనిసరిగా ఏర్పాటు చేయాలని ఏవో నాగమణి అన్నారు. కోరుట్ల పట్టణంతోపాటు మండలంలోని ధర్మారం, మాదాపూర్, నాగులపేట గ్రామాల్లోని ఎరువుల దుకాణాలను శని వారం ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఎరువుల అమ్మకాలను ఈ–పాస్ బయోమెట్రిక్ పద్ధతిలోనే విక్రయించాలని సూచించారు. ఏఈవోలు నరేశ్, మమత ఉన్నారు.



రికార్డులు పరిశీలిస్తున్న ఏవో నాగమణి

పేద యువతుల పెళ్లికి ఆర్థికసాయం

ధర్మపురి: మండలంలోని కమలాపూర్‌కు చెందిన ఒడ్డేటి మల్లేశం–లక్ష్మి దంపతుల కూతురు వివాహం ఆదివారం జరగనుంది. రాయపట్నంలో శనివారం ఓ నిరుపేద యువతి పెళ్లి జరిగింది. వీరిద్దరికి ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్ కుమార్ రూ.10 వేల చొప్పున పంపించగా కాంగ్రెస్ మండల కాంగ్రెస్ నాయకులు అందజేశారు. కార్యక్రమంలో వేముల రాజేశ్, చిలుముల లక్ష్మణ్, అప్పం తిరుపతి తదితరులు పాల్గొన్నారు.



ఆర్థికసాయం అందిస్తున్న నాయకులు

ఎమ్మెల్సీ కవిత అరెస్టుపై నిరసన

మెట్‌పల్లిరూరల్: ఇబ్రహీంపట్నంలోని ఇందిరాగాంధీ చౌరస్తా వద్ద బీఆర్‌ఎస్ నాయకులు ప్రధాని మోదీ దిష్టిబొమ్మను దహనం చేసి, కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు.

మెట్‌పల్లి: పట్టణంలోని పాత బస్టాండ్ వద్ద బీఆర్‌ఎస్ నాయకులు ఆందోళన చేపట్టారు. బీఆర్‌ఎస్‌ను దెబ్బతీయడానికే ఎమ్మెల్సీ కవితను బీజేపీ అక్రమంగా అరెస్టు చేయించిందని ఆరోపించారు. అంతకుముందు ప్రధాని మోదీ దిష్టిబొమ్మను దహనం చేశారు. పలువురు కౌన్సిలర్లు, నాయకులున్నారు.

కథలాపూర్: మండల కేంద్రంలో బీఆర్‌ఎస్ నాయకులు నిరసన తెలిపారు. దుకాణాలను బంద్ చేయించారు. కల్లెడ శంకర్, బద్దం మహేందర్, నాగేశ్వర్‌రావు, పాలెపు రాజేశ్, జలంధర్ తదితరులున్నారు.

రాయికల్: స్థానిక గాంధీ చౌక్ వద్ద బీఆర్‌ఎస్ నాయకులు నల్లజెండాలతో నిరసన తెలిపారు. కేంద్ర ప్రభుత్వం మాజీ సీఎం కేసీఆర్ కుటుంబంపై కక్ష గట్టి, ఎమ్మెల్సీ కవితను అరెస్టు చేయించిందని ఆరోపించారు. ఎంపీపీ సంధ్యారాణి, జెడ్పీటీసీ సభ్యురాలు జాదవ్ అశ్విని, మున్సిపల్ చైర్మన్ మోర హన్మాండ్లు, వైస్ చైర్‌పర్సన్ రమాదేవి, పార్టీ మండల అధ్యక్షుడు కోల శ్రీనివాస్, కౌన్సిలర్లు తురగ శ్రీధర్‌రెడ్డి, సాయికుమార్, మహేందర్, నాయకులు పాల్గొన్నారు.



రాయికల్‌లో నల్లబ్యాడ్జీలతో మున్సిపల్ చైర్మన్, ప్రజాప్రతినిధులు, నాయకులు



మెట్‌పల్లిలో రోడ్డుపై బైఠాయించిన బీఆర్‌ఎస్ నాయకులు

మల్యాల: ఎమ్మెల్సీ కవిత అరెస్టును నిరసిస్తూ శనివారం మల్యాల మండల కేంద్రంలోని బ్లాక్ చౌరస్తాలో బీఆర్‌ఎస్ నాయకులు నల్ల బ్యాడ్జీలు ధరించి, ధర్నా చేపట్టారు. రాజకీయ కక్షతోనే ఆమెను అరెస్టు చేశారని ఆరోపించారు. బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు జనగాం శ్రీనివాస్, మాజీ సర్పంచులు సుదర్శన్, తిరుపతిరెడ్డి, లక్ష్మీబుచ్చన్న, శ్రీనివాస్, గడ్డం రాజేశ్వర్‌రావు, చిన్న దుర్గయ్య, నాయకులున్నారు.

సంక్షిప్త వార్తలు

రంజాన్ దీక్షలు ప్రశాంతంగా జరుపుకోవాలి

మెట్‌పల్లి: రంజాన్ ఉపవాస దీక్షలను ప్రశాంతంగా జరుపుకోవాలని డీఎస్పీ ఉమామహేశ్వర్‌రావు అన్నారు. పట్టణంలోని తన కార్యాలయంలో శనివారం శాంతి కమిటీ సమావేశం నిర్వహించారు.

జెడ్పీటీసీ పదవికి రాజీనామా చేయాలి

సారంగాపూర్: బీర్‌పూర్ జెడ్పీటీసీ సభ్యురాలు పద్మ, ఆమె భర్త రమేశ్ బీజేపీలో చేరడంపై కాంగ్రెస్ ఉమ్మడి మండల ప్రధాన కార్యదర్శి గుడిసె జితేందర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. పదవికి, కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు.

పరీక్ష సామగ్రి పంపిణీ

సారంగాపూర్: స్థానిక కేజీబీవీ పదోతరగతి విద్యార్థులకు ఆర్యవైశ్య సంఘం ఉమ్మడి మండల ప్రధాన కార్యదర్శి యాసాల మల్లికార్జున్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కోండ్ర రాంచంద్రారెడ్డి శనివారం పరీక్ష సామగ్రి అందించారు.

మెట్‌పల్లి: పట్టణంలోని చావిడి వద్ద గల ప్రభుత్వ బాలికలు, ఉర్దూ మీడియం హైస్కూళ్లలో పదోతరగతి విద్యార్థులకు శనివారం లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో పరీక్ష సామగ్రి పంపిణీ చేశారు. క్లబ్ అధ్యక్షుడు దొంతుల ఆంజనేయులు, ఇల్లెందుల శ్రీధర్, చెర్లపల్లి రాజేశ్వర్, నాంపల్లి శ్రీనివాస్, ఇల్లెందుల వెంకటేశ్వర్లు తదితరులున్నారు.

మెట్‌పల్లిరూరల్: ఆత్మకూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పదోతరగతి విద్యార్థులకు మున్నాభాయ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో శనివారం పరీక్ష సామగ్రి పంపిణీ చేశారు. ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మల్లాపూర్: మండలంలోని కొత్తదాంరాజుపల్లి జెడ్పీ, కేరళ హైస్కూళ్లలో పదోతరగతి విద్యార్థులకు పటేల్స్ యూత్ సభ్యులు శనివారం పరీక్ష సామగ్రి పంపిణీ చేశారు. రాజేందర్, రాజు, విజయ్, సాయి, నరేశ్, టీచర్లు పాల్గొన్నారు.

గీత కార్మికులకు గుర్తింపు కార్డులు..

మెట్‌పల్లిరూరల్: ఇబ్రహీంపట్నం మండలంలోని డబ్బా గ్రామంలో గీత కార్మికులకు శనివారం గుర్తింపు కార్డులు పంపిణీ చేశారు. సర్వాయి పాపన్న గీత కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు చంద్రశేఖర్, మండల అధ్యక్షుడు నేరెళ్ల సుభాష్‌గౌడ్, సభ్యులున్నారు.

ఫంక్షన్‌హాల్ నిర్మాణానికి నిధులు మంజూరు

మెట్‌పల్లిరూరల్: మెట్‌పల్లి మండలంలోని జగ్గాసాగర్ కొండస్వామి ఆలయ ఆవరణలో ఫంక్షన్‌హాల్ నిర్మాణానికి ఎంపీ ల్యాడ్స్ నుంచి రూ.4 లక్షల నిధులు మంజూరయ్యాయి. సంబంధిత ప్రొసీడింగ్ కాపీని శనివారం ఆలయ కమిటీ సభ్యులకు బీజేపీ నాయకులు అందజేశారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

మెట్‌పల్లి: పట్టణంలోని కొత్త బస్టాండ్ ప్రాంతంలో ఆదివారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ రవి తెలిపారు.

ఎల్‌వోసీ అందజేత

కోరుట్ల రూరల్: యూసుఫ్‌నగర్‌కు చెందిన కరిపె యోగేశ్ అనారోగ్యంతో నిమ్స్‌లో చేరాడు. ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్ సీఎం సహాయనిధి నుంచి రూ.1.20 లక్షల ఎల్‌వోసీ మంజూరు చేశారు. సంబంధిత కాపీని స్థానిక ఎంపీటీసీ సభ్యురాలు గుగ్గిళ్ల ప్రియాంక, జిల్లా గ్రంథాలయ మాజీ డైరెక్టర్ సురేశ్‌గౌడ్ బాధిత కుటుంబానికి శనివారం అందించారు.

ప్రొసీడింగ్ కాపీలు..

కోరుట్ల: పట్టణంలోని వేంకటేశ్వర ఆలయ షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణం కోసం రూ.70 లక్షలు, షాదీఖానాకు రూ.38 లక్షలు మంజూరయ్యాయని కాంగ్రెస్ సీనియర్ నాయకుడు జువ్వాడి కృష్ణారావు తెలిపారు. శనివారం సంబంధిత ప్రొసీడింగ్ కాపీలను ఆయా సంస్థల ప్రతినిధులకు అందించారు.

సీసీరోడ్డు పనులకు భూమిపూజ

రాయికల్: పట్టణంలోని 3వ వార్డులో రూ.80 లక్షలతో చేపట్టనున్న సీసీరోడ్డు, మురికి కాలువల పనులకు మున్సిపల్ చైర్మన్ మోర హన్మాండ్లు శనివారం భూమిపూజ చేశారు. వైస్ చైర్‌పర్సన్ రమాదేవి, కౌన్సిలర్ సాయికుమార్, నాయకులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు..

కథలాపూర్: సిరికొండలో అంబేద్కర్ మాదిగ, మాల సంఘాల భవనాలకు రూ.8 లక్షలు మంజూరయ్యాయి. ఆయా సంఘాల ప్రతినిధులకు శనివారం ప్రొసిడింగ్ కాపీలు అందించారు. భూషణరావుపేట ప్రభుత్వ పాఠశాలలో బోరుబావి, రాజారాం తండా పాఠశాల ప్రహరీ పనులకు భూమిపూజ చేశారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, నాయకులు హఫీజ్, మధు, శ్రీనివాస్, చిన్నారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

మల్లాపూర్: మండలంలోని గోదావరి నది, పెద్ద వాగుల నుంచి శనివారం వేకువజామున అక్రమంగా ఇసుక తరలిస్తున్న 5 ట్రాక్టర్లను పట్టుకున్నట్లు తహసీల్దార్ వీర్‌సింగ్ తెలిపారు. వాటిని తహసీల్దార్ కార్యాలయానికి తరలించినట్లు పేర్కొన్నారు.

యువతి అదృశ్యం

సారంగాపూర్: లచ్చునాయక్‌తండాకు చెందిన ఓ యువతి అదృశ్యమైనట్లు హెడ్‌కానిస్టేబుల్ రవీందర్‌రెడ్డి తెలిపారు. ఆయన వివరాల ప్రకారం.. యువతి కరీంనగర్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో నర్సుగా పని చేస్తోంది. రెండు రోజుల క్రితం ఇంటి నుంచి వెళ్లింది. హాస్పిటల్‌కు చేరుకోకపోవడంతో ఆస్పత్రి వర్గాలు ఆమె ఇంటికి ఫోన్ చేశారు. కుటుంబసభ్యులు చుట్టుపక్కల, తెలిసినవారి ఇళ్లలో వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో శనివారం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అదృశ్యం కేసు నమోదు చేసినట్లు హెడ్‌కానిస్టేబుల్ పేర్కొన్నారు.

కొడిమ్యాలలో ఎన్‌ఎస్‌ఎస్ క్యాంపు ప్రారంభం

కొండగట్టు: కరీంనగర్ వివేకానంద డిగ్రీ, పీజీ కళాశాలకు చెందిన ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్ల వారం రోజుల క్యాంపును శనివారం కొడిమ్యాల మండలం కేంద్రంలో ప్రారంభించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఎంపీడీవో స్వరూప మాట్లాడుతూ.. ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లు గ్రామాల అభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తున్నారని కొనియాడారు. ప్రోగాం అధికారి గోపికృష్ణ మాట్లాడుతూ.. కొడిమ్యాల, కొండాపూర్ గ్రామాల్లో సామాజిక అవగాహన ర్యాలీలు, స్వచ్ఛ భారత్ నిర్వహిస్తామన్నారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ బాలకృష్ణారెడ్డి, మాజీ ఉపసర్పంచ్ జీవన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నాచుపెల్లిలో లక్ష్మీనృసింహుని ఆలయం..

కొండగట్టు: నాచుపెల్లిలో శ్రీలక్ష్మీనృసింహుని నూతన ఆలయాన్ని శనివారం ప్రారంభించారు. స్వామి వారి విగ్రహాన్ని గంగాధర మండలం మల్లాపూర్‌కు చెందిన తూడి లచ్చయ్య అందజేశారు.

విద్యార్థులు లక్ష్యం పెట్టుకోవాలి

జగిత్యాల: విద్యార్థులు లక్ష్యం పెట్టుకొని, దాన్ని సాధించేందుకు శ్రమించాలని రామకృష్ణ డిగ్రీ కళాశాల కరస్పాండెంట్ రామకృష్ణ అన్నారు. టాస్క్ ఆధ్వర్యంలో కరీంనగర్‌లో నిర్వహించిన జాబ్‌మేళాలో తమ విద్యార్థులు 27 మంది ఉద్యోగాలు సాధించారని తెలిపారు. ఆయనతోపాటు ప్రిన్సిపాల్ మునీందర్‌రెడ్డి వారిని శనివారం అభినందించారు.

హనుమాన్ ఆలయ కమిటీ ప్రమాణస్వీకారం

రాయికల్: పట్టణంలోని నాగారం హనుమాన్ ఆలయ కమిటీ చైర్మన్‌గా దాసరి గంగాధర్, సభ్యులు కల్లెడ రాజు, రాయిల్ల ప్రభాకర్, నరంశెట్టి మనోజ్, రాజిరెడ్డి, నోముల జ్యోతి, గణేశ్‌లతో ఈవో విక్రమ్‌గౌడ్ శనివారం ఆలయంలో ప్రమాణస్వీకారం చేయించారు.

చిరుధాన్యాలతో సంపూర్ణ ఆరోగ్యం

మల్యాల: గర్భిణులు, తల్లులు చిరుధాన్యాలు, పౌష్టికాహారం తీసుకుంటే సంపూర్ణ ఆరోగ్యం చేకూరుతుందని అంగన్‌వాడీ టీచర్ సంతోషిణి అన్నారు. మల్యాల అంగన్‌వాడీ కేంద్రంలో శనివారం పోషణ్ పక్వాడ కార్యక్రమం నిర్వహించారు. తల్లులు, గర్భిణులకు చిరుధాన్యాల ప్రాధాన్యంపై అవగాహన కల్పించారు. పిల్లలకు సామూహిక అక్షరాభ్యాసం చేయించారు.



మల్యాలలో అక్షరాభ్యాసం

కొండగట్టు: కొడిమ్యాల మండలంలోని సంద్రాలపల్లి ప్రాథమిక పాఠశాలలో శనివారం పోషణ పక్షోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా తల్లిదండ్రులకు చిరుధాన్యాలపై అవగహన కల్పించి, చిత్రలేఖనం, వ్యాసరచన పోటీలు జరిపారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు ఆదిరెడ్డి, ఎంపీటీసీ మాజీ సభ్యుడు శంకర్ తదితరులు పాల్గొన్నారు.